

గృహ నిర్మాణశాఖలో జరిగిన అవినీతిపై ఆ శాఖ ప్రధాన కార్యాలయం విజిలెన్స్ విభాగం దృష్టి సారించింది. జిల్లాలోని ఘంటసాల, పెదపారుపూడి, మోపిదేవి, పెడన మండలాల్లో విచారణ చేపట్టింది. 15 రోజులుగా విచారణ సాగుతున్నా.. ఘంటసాల మండలంలో అక్రమాల లెక్క ఓ కొలిక్కి రాలేదు. పెదపారుపూడి మండలంలో రూ.33 లక్షలకుపైగా అవినీతి జరిగినట్టు నిర్ధారణకు వచ్చారు. అయితే ఇక్కడ అక్రమాలకు పాల్పడిన అధికారిని వదిలేసి.. ఇన్‌చార్జిగా పనిచేసిన అధికారికి నోటీసులు ఇవ్వడంపై సంచలనం రేపింది.

విజిలెన్స్

గృహ నిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై విచారణ

- ఘంటసాల మండలంలో తేలని అక్రమాల చిట్టా!
- పెదపారుపూడి మండలంలో రూ.33 లక్షలకుపైగా అవినీతి జరిగినట్టు నిర్ధారణ
- అక్రమాలకు పాల్పడిన అధికారిని వదిలేసి.. ఇన్‌చార్జిగా చేసిన వారికి నోటీసులు
- తనపై చర్యలు తీసుకోకుండా చక్రం తిప్పుతున్న విశ్రాంత అధికారి
- మోపిదేవి, పెడన మండలాల్లోనూ విచారణ ప్రారంభం
- అక్రమాల లెక్కలు తేల్చే పనిలో 15 రోజులుగా బిజీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లా వ్యాప్తంగా గృహ నిర్మాణశాఖలో పలుచోట్ల జరిగిన అక్రమాలపై గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదులు అందాయి. వీటిపై విజిలెన్స్ విభాగం అధికారులు దృష్టి సారించారు. 15 రోజుల నుంచి ఘంటసాల, మోపిదేవి, పెడన, పెదపారుపూడి మండలాల్లో విచారణ జరుపుతున్నారు. ఈ విచారణలో ఘంటసాల మండలంలోని గోడౌన్‌లో ఎంత మేర అక్రమాలు జరిగాయనే అంశంపై లెక్కలు అంతుచిక్కనట్లు సమాచారం. ఆలస్యమైనా ఈ మండలంలో జరిగిన అక్రమాలపై లెక్కలు తేల్చేపనిలో అధికారులు ఉన్నారు. మరింత సమయం పట్టవచ్చు.

పెదపారుపూడి మండలంలో రూ.33 లక్షలకుపైగా అక్రమాలు!

పెదపారుపూడి మండలం పామర్రు డివిజన్ పరిధిలో ఉంటుంది. గతంలో ఈ డివిజన్ డీఈగా పనిచేసిన అధికారి పామర్రులోనే ప్రైవేట్ గోడౌన్‌ను ఏర్పాటు చేసి అక్కడ సిమెంటు, ఇనుమును దించి విక్రయించేశాడు. పెదపారుపూడి మండలంలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు సిమెంటు, ఇనుము ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు, మండల గృహ నిర్మాణ సంస్థలో పనిచేసే సిబ్బంది జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. పామర్రు డివిజన్‌లో డీఈగా పనిచేసిన అధికారి జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయానికి బదిలీపై వచ్చి కీలక బాధ్యతలు నిర్వహించడంతో, ఈ ఫిర్యాదులపై నామమాత్రంగా విచారణ చేసిన అధికారులు ఈ ఫైలును పక్కపెట్టేశారు. జిల్లా కార్యాలయంలో పనిచేసే డీఈ ఇటీవల కాలంలో గుడివాడ డివిజన్‌కు బదిలీపై వెళ్లి పదవీ విరమణ చేశారు. పెదపారుపూడి మండలంలో రూ.33 లక్షలకుపైగా సిమెంటు, ఇనుము పక్కదారి పట్టినట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. అక్రమాలకు పాల్పడిన అధికారి పదవీ విరమణ చేసేవరకు ఈ వ్యవహారాన్ని బయటకు రాకుండా, సంబంధిత అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కావాలనే జాప్యం చేశారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో పెదపారుపూడి మండలంలో జరిగిన అక్రమాలపై జిల్లాస్థాయి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో, నేరుగా గృహ నిర్మాణ సంస్థ కేంద్ర కార్యాలయంలో పలువురు ఫిర్యాదులు చేశారు. దీంతో అక్రమాలకు పాల్పడిన అధికారిని వదిలేసి ఈ డివిజన్‌లో తొమ్మిది రోజులపాటు ఇన్‌చార్జి డీఈగా పనిచేసిన అధికారికి జిల్లాస్థాయి అధికారులు నోటీసులు జారీ చేయడంతో ఈ అంశం సంచలనంగా మారింది. గతంలో పామర్రు డివిజన్‌లో అక్రమాలకు పాల్పడి, ఇటీవలనే పదవీ విరమణ చేసిన డీఈ తనపై విచారణ జరగకుండా, ఎలాంటి చర్యలు తీసుకోకుండా తెరవెనుక చక్రం తిప్పుతున్నాడని గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

మళ్లీ ఉద్యోగంలో చేరేందుకు ఏఈ తెరవెనుక మంత్రాంగం

మోపిదేవి మండలం గిరిజనకాలనీలో 10 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పున ఇళ్లస్థలాలు ఇచ్చారు. గిరినులకు ఇచ్చిన ఇంటిస్థలంలో ఇల్లు నిర్మాణం చేసే బాధ్యతను గతంలో ఈ మండలంలో పనిచేసిన ఏఈ తీసుకుని ఆయనే కాంట్రాక్టర్‌గా మారి గృహాలు మిగతా 6లో..

ఆ ఇద్దరు ఏఈల విద్యార్హతలపై విచారణ

గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయం విజిలెన్స్ విభాగం అధికారుల విచారణలో పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూసినట్లు సమాచారం. కాంట్రాక్టు పద్ధతిపై వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా విధుల్లో చేరిన వారు, ఆ తర్వాత కాలంలో ఇంజనీరింగ్‌లో డిగ్రీ లేదా డిప్లొమా చదివినట్లుగా సర్టిఫికెట్లు చూపి ఏఈలుగా పనిచేస్తున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి ఘంటసాల, పెడన రూరల్ మండల ఏఈలుగా చలామణి అవుతున్నారనే అంశంపైనా గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ అంశంపైనా విజిలెన్స్ అధికారులు విచారణ ప్రారంభించారు. ఘంటసాల, పెడన మండలాల్లో ఏఈలుగా పనిచేస్తున్న వారు సమర్పించిన విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లపై విచారణ నిమిత్తం ఆయా యూనివర్సిటీలకు విజిలెన్స్ అధికారులు లేఖ రాసినట్లు తెలిసింది. దాదాపు వీరు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవేనని ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం.



నిమ్మలూరులోని బెల్ కంపెనీ

నిమ్మలూరులో బెల్ కంపెనీ ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

మచిలీపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నిమ్మలూరులో నూతనంగా నిర్మించిన బెల్ కంపెనీని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. నిమ్మలూరు గ్రామం వద్ద రూ.362 కోట్ల వ్యయంతో బెల్ కంపెనీని గతంలో నిర్మాణం చేశారు. కర్నూలు జిల్లా నన్నూరు వద్ద సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన జిల్లాలోని నిమ్మలూరు బెల్ కంపెనీలో అడ్వాన్స్‌డ్ నైట్‌విజన్ ప్రొడక్ట్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో ప్రత్యర్థి దేశం ప్రయోగించిన డ్రోన్‌లను ఇక్కడ తయారు చేసిన పరికరాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయని తెలిపారు. దీంతో మన దేశరక్షణ వ్యవస్థ ఎంత పటిష్టవంతంగా ఉందో ప్రపంచదేశాలకు తెలిసి వచ్చిందని వివరించారు.

గన్నవరంలో ఖోఖో శిక్షణ తరగతులు

- రాష్ట్ర బాలికల జట్టుకు తర్ఫీదు
- సౌత్ జోన్ పోటీల్లో పతకం సాధించాలి
- రాష్ట్రంలో క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట
- శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్



ఖోఖో జట్టు శిక్షణను ప్రారంభిస్తున్న రవీంద్రనాథ్

గన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ ఖోఖో సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళా ఖోఖో జట్టు శిక్షణ తరగతులు గురువారం ఆరంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఖో ఖో బాలికల జట్టు అకుంఠిత దీక్షతో సాధన చేసి, సౌత్ జోన్ పోటీల్లో పతకంతో తిరిగి రావాలని మిగతా 6లో..



సీడ్.. స్పీడ్‌గా..

- సీడ్ యాక్సెస్ రోడ్డుకు లైన్‌క్లియర్
- 14 ఎకరాలు ఇచ్చిన 22 మంది రాజధాని రైతులు
- సీఆర్‌డీఏ కమిషనర్‌కు అంగీకారపత్రాల అందజేత
- ఇప్పటికే రెండో దశ పనులకు శ్రీకారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రైతుల సానుకూలతతో సీడ్ యాక్సెస్ రోడ్డుకు లైన్‌క్లియర్ అవుతోంది. ఈ రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టిన సీఆర్‌డీఏకు రాజధాని రైతులు శుభ సంకేతాలు ఇస్తున్నారు. ఉండవల్లిలో సీడ్ యాక్సిస్ రోడ్డు పరిధిలో భూములు కలిగిన 22 మంది రైతులు తమ 14 ఎకరాలను ఇవ్వటానికి అంగీకారం తెలిపారు. ఈ రోడ్డుకు సంబంధించి ఇప్పటికే 25 వరకు కోర్టు కేసులున్నాయి. దీంతో మొదటి దశలోనే రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది.

రెండోదశ విస్తరణలో సానుకూల సంకేతాలు

రెండోదశ విస్తరణ పనుల్లో భాగంగా ఉండవల్లి నుంచి పనులు చేపట్టేందుకు సీఆర్‌డీఏ అధికారులు సన్నాహాలు చేపట్టారు. మంగళగిరిలోని సుందరయ్య కాలనీ మీదుగా ఎలివేటెడ్ కారిడార్‌ను అభివృద్ధి చేస్తూ ఎన్‌హెచ్-16కు ఈ రోడ్డును అనుసంధానించాల్సి ఉంటుంది. ఈ ఎలివేటెడ్ కారిడార్‌కు కూడా సీఆర్‌డీఏ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇదే సమయంలో సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు ఈ-11, 13 రోడ్లను కూడా సమాంతరంగా ఎన్‌హెచ్-16 వరకు విస్తరించటానికి ఇప్పటికే సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. వీటి పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయి. ఈ క్రమంలో సీడ్ యాక్సెస్ రోడ్డును ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్న ఉద్దేశంతో సీఆర్‌డీఏ ప్రణాళికలు రూపొందించింది. ఇంతకుముందు మంత్రి నారాయణ పిలుపు మేరకు పలువురు రైతులు మిగతా 6లో..

మత్తు వదిలింది

- నకిలీ మద్యం ఉదంతంతో కొత్త నిబంధనలు
- జిల్లాలో ఎక్కడి మద్యం అమ్మకాలు అక్కడే
- మరెక్కడికీ తరలించకూడదని ఆదేశాలు
- వ్యాపారులకు ఎక్సైజ్ శాఖ స్పష్టీకరణ

అన్నమయ్య జిల్లా ములకలచెరువు, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో వెలుగులోకి వచ్చిన నకిలీ మద్యం ప్రభావం కొత్త విధానాలను తీసుకొస్తోంది. ఇప్పటికే మద్యం అమ్మకాల్లో పారదర్శకత కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించింది. తాజాగా నో క్రాసింగ్ విధానాన్ని అమలు చేస్తోంది.



ఆంధ్రజ్యోతి-విజయవాడ : బార్, మద్యం దుకాణం ఒకే వ్యక్తి చేతిలో ఉన్నప్పుడు ఒకచోట సరుకును మరోచోటకు మార్చుకుంటారు. ఇక నుంచి ఆ విధానానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని అధికారుల నుంచి వ్యాపారులకు ఆదేశాలు అందాయి. దీనికి సంబంధించి అన్ని మద్యం దుకాణాలు, బార్‌లకు స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ని సిద్ధం చేశారు. అదేవిధంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో 183 బార్‌లకు నోటిఫికేషన్ ఇవ్వగా, 118 బార్‌లను కేటాయించారు. ఇవికాకుండా 261 మద్యం దుకాణాలు ఉన్నాయి. వాటిలో కొంతమంది వ్యాపారులు భాగస్వాములుగా ఏర్పడి సంయుక్తంగా మద్యం దుకాణాలు, బార్‌లను దక్కించుకున్నారు.

ఇప్పటివరకు జరిగింది ఇది..

వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడి మద్యం దుకాణాలను, బార్‌లను దక్కించుకోవడం ఎప్పటినుంచో జరుగుతోంది. జిల్లాను యూనిట్‌గా తీసుకుని వివిధ ప్రాంతాల్లో బార్‌లు, మద్యం దుకాణాలను సిండికేట్‌లో ఉన్న సభ్యులు తీసుకుంటారు. బార్ ఒకరి పేరున ఉంటే, మద్యం దుకాణం మరొకరి పేరున ఉంటుంది. లైసెన్స్ ఒకరి పేరుతో ఉన్నప్పటికీ సిండికేట్‌లో ఉన్నవారంతా వాటికి యజమానులుగా ఉంటారు. బార్, మద్యం షాపులకు అవసరమైన సరుకును డిపోల నుంచి కొంటారు. దీనికయ్యే ఖర్చును భాగస్వాములంతా సమానంగా భరిస్తారు. వచ్చిన లాభాలను పెట్టుబడిని బట్టి పంచుకుంటారు. బార్, మద్యం దుకాణం ఒకే వ్యక్తి పేరుతో ఉన్నప్పుడు రెండింటికీ ఒకరే యజమానిగా ఉంటారు. మద్యం దుకాణంలో సరుకు నిండుకుంటే ఆ బ్రాండ్‌లను బార్ నుంచి రప్పించుకుని విక్రయించుకుంటున్నారు. ఈ సరుకును మొత్తం కొన్న వ్యాపారి ఒకరే కాబట్టి ఒకచోట సరుకును మరోచోటకు తరలించుకుంటారు. అధికారుల తనిఖీల సమయంలో ప్రశ్నించినా ఇదే విషయం చెప్పేవారు.

ఇక అలా కుదరదు

ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం వ్యవహారం వెలుగులోకి రావడంతో ఈవిధంగా ఒకచోట సరుకును మరోచోటకు తరలించడం నిలుపుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ విధానంలోనూ అక్రమాలు జరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. వాస్తవానికి 2014-19 వరకు మద్యం సరుకుపై నిఘా, ట్రాకింగ్ ఉండేది. ఇదంతా ఆన్‌లైన్‌లో అధికారులకు తెలిసిపోయేది. మద్యం దుకాణం, బార్‌లో రోజుకు ఎంతెంత అమ్మకాలు జరుగుతున్నాయి, ఏ సమయంలో ఎంతెంత మద్యం అమ్ముతున్నారు.. అనే వివరాలు స్పష్టంగా ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక నిఘా నిద్దరపోయింది. ట్రాకింగ్‌కు ట్రాక్ లేకుండాపోయింది. అద్దేపల్లి జనార్దనరావు నకిలీ మద్యం తయారీకి పూనుకోవడానికి ఈవిధానం ఒక కారణంగా అధికారులు భావిస్తున్నారు. మద్యం షాపు, బార్ ఒకరి ఆధ్వర్యంలోనే నడుస్తున్నా సరకు మార్పిడికి మాత్రం అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎక్కడైనా ఈవిధంగా జరిగితే సంబంధిత వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ అధికారులు ఉమ్మడి జిల్లాలోని ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

ఇద్దరు వైసీపీ సానుభూతి కాంట్రాక్టర్ల

రీ ఎంట్రీతో హడల్

- వణికిపోతున్న గుడివాడ మున్సిపల్ ఉద్యోగులు
- భయం భయంగా విధుల్లోకి మహిళా సిబ్బంది
- వైసీపీ హయాంలో ఆ కాంట్రాక్టర్ల నోటికి అడ్డేలేదు..
- గతంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందిపై దాడులు
- మాట వినని వారిపై తిట్ల దండకం
- తాజాగా వీరిలో ఒకరికి టీడీపీ, మరొకరికి జనసేన మద్దతు

గత వైసీపీ ప్రభుత్వంలో ఇద్దరు కాంట్రాక్టర్‌లను చూసి గుడివాడ మున్సిపాల్టీలో పనిచేసే ఉద్యోగులు హడలెత్తిపోయారు. ఏ రోజుకా రోజు భయం భయంగా విధులు నిర్వర్తించేవారు. కాంట్రాక్టర్లు చేసిన అరాచకం, మాట్లాడిన బూతులు, ఉద్యోగులపై చెయ్యి చేసుకోవడం వంటి వికృత చేష్టలు ఉద్యోగులను భయాందోళనకు గురిచేశాయి. ఒకానొక సమయంలో ఉద్యోగులు కొందరు మూకుమ్మడిగా సెలవుపై వెళ్లిపోవాలని కూడా భావించారు. ఇప్పుడు ఆ ఇద్దరు కాంట్రాక్టర్లు మళ్లీ రీ ఎంట్రీ ఇవ్వడంతో ఉద్యోగులు భయంతో వణికిపోతున్నారు.



ఆంధ్రజ్యోతి - గుడివాడ: గత వైసీపీ ప్రభుత్వంలో గుడివాడ పురపాలక సంఘంలో ఇద్దరు కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. మున్సిపాల్టీలో పనిచేసే సిబ్బంది ఎవరైనా సరే తాము చెప్పిన పని, తమ ఫైళ్లను వెంటనే ఓకే చేయకుంటే తమ విశ్వరూపాన్ని చూపేవారు. వయస్సు, జెండర్‌తో సంబంధం లేకుండా నోటికి వచ్చినట్టు తిట్ల పురాణం ఎత్తుకునేవారు. తన తండ్రి వయస్సు ఉన్న వారిని సైతం ఏకవచనంతో మాట్లాడేవారు. మహిళా ఉద్యోగుల పట్ల అనుచితంగా వ్యవహరించారు. ఇద్దరు మున్సిపల్ ఉన్నతాధికారులపై చెయ్యి కూడా చేసుకున్నారు. ఓ మహిళా ఉద్యోగిని రాయలేని భాషతో దూషించారు. ఆ ఐదేళ్లు ఎన్నో అరాచకాలు సృష్టించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీరు కనిపించకుండాపోయారు. దీంతో మున్సిపల్ ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ప్రశాంత వాతావరణంలో ఉద్యోగం చేసుకుంటున్న వీరికి కాంట్రాక్టర్ల రీ ఎంట్రీ షాక్‌కు గురిచేసింది. గతంలో తమను ఇబ్బంది పెట్టిన వారిని తిరిగి తీసుకు రావడంతో కూటమి నాయకులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలో మిగతా 6లో..

ఏడాది పాటు అదృశ్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాది పాటు ఇద్దరు కాంట్రాక్టర్లు అదృశ్యమయ్యారు. ఒక కాంట్రాక్టర్ తాడిగడప మున్సిపాల్టీ పరిధిలో చేరాడు. గతంలో గుడివాడలో పనిచేసి, బదిలీపై తాడిగడప మున్సిపాల్టీకి వచ్చిన వారితో ఉన్న సత్సంబంధాలతో అక్కడ అరాచకానికి తెరలేపాడని సమాచారం. ఏకంగా ఉన్నత స్థాయి ఉద్యోగిపై దాడి చేసి అంతుచూస్తానని బెదిరించి, మహిళా ఉద్యోగులను బండబూతులు తిట్టిన మరో కాంట్రాక్టర్ ఏడాది క్రితం వరకు గుడివాడలో సైలెంట్ మోడ్‌లో ఉన్నాడు. ఈ కాంట్రాక్టర్ తండ్రి ప్రస్తుతం వైసీపీ గుడివాడ పట్టణ కమిటీలో ముఖ్య నాయకుడిగా చెలామణి అవుతున్నాడు.

ఆచరణాత్మక బోధన చేయాలి

- కొత్త ఉపాధ్యాయుల శిక్షణలో కలెక్టర్ బాలాజీ

రూ.2.96 కోట్ల స్కాలర్‌షిప్‌ల పంపిణీ

- సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీ విద్యార్థులకు లబ్ధి
- విద్యానైపుణ్యాలు పెంచేందుకే..
- ఎస్‌ఏజీటీఈ కార్యదర్శి లక్ష్మణరావు

ఇంద్రకీలాద్రిపై కార్తీక మాసోత్సవ ఏర్పాట్లు

- ఈవో శీనానాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ

6లో

నమో..జోష్



ప్రధాని సభకు ముస్లిం మహిళలు



సభకు వేలాది బస్సులు ఇలా...



మోదీతో చంద్రబాబు, పవన్









'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు సుమారు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)



ఉప్పొంగిన దేశభక్తి



శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ



సభలో టీడీపీ మహిళా నేతలు







పొలాల వెంబడి పరుగులు

ఇంద్రకీలాద్రిపై కార్తీక మాసోత్సవ ఏర్పాట్లు

» దుర్గగుడి ఈవో, చైర్మన్ వెల్లడి

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మల్లేశ్వరస్వామివారికి అభిషేకాలు, సహస్రలింగార్చనలు, బిల్వార్చనలు, త్రికాల పూజలు, తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం సిద్ధమవుతోంది. ఇదేక్రమంలో భవానీ దీక్షల స్వీకరణ, విరమణ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఇంద్రకీలాద్రిపై విలేకరుల సమావేశంలో ఈవో వీకే శీనానాయక్, పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, సభ్యులు తదితరులు ఉత్సవ వివరాలను వెల్లడించారు. వైదిక కమిటీ సూచనల మేరకు ఈనెల 19వ తేదీ ఆదివారం ధనత్రయోదశి సందర్భంగా ఉదయం 8 గంటలకు రుద్రహోమ కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం మహాలక్ష్మీయాగాన్ని నిర్వహిస్తారు. సోమవారం దీపావళి పర్వదినం సందర్భంగా అమ్మవారి ప్రధాన ఆలయంలో ధనలక్ష్మీపూజ, దీపాలంకరణ, బాణాసంచా కాల్చటం తదితర కార్యక్రమాల



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

అనంతరం సాయంత్రం 7 గంటల నుంచి అమ్మవారి ప్రధాన ఆలయం, ఉపాలయాలను కవాటబంధనం చేసి మూసివేస్తారు. 22వ తేదీ నుంచి నవంబరు 20వ తేదీ వరకు కార్తీక మాసం సందర్భంగా నెలరోజుల పాటు విశేష అభిషేక, అర్చనాది కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 21వ తేదీ మంగళవారం ప్రదోషకాలంలో మల్లేశ్వరాలయం, శివకామసుందరీ సమేత నటరాజస్వామి ఆలయంలో ఆకాశదీపాలను ప్రారంభిస్తారు. 23న అమ్మవారికి గాజుల ఉత్సవాన్ని నిర్వహిస్తారు. 25వ తేదీ నాగుల చవితి సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఉదయం 4 గంటలకు అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నవంబరు 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా కోటి దీపోత్సవ కార్యక్రమం, మల్లేశ్వరస్వామి ఆలయంలో జ్వాలా తోరణం నిర్వహిస్తారు. నవంబరు 18న మాస శివరాత్రిని పురస్కరించుకుని సాయంత్రం 4 గంటలకు మల్లేశ్వరస్వామికి విశేష అన్నాభిషేక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. నవంబరు 21తో కార్తీక మాస ఉత్సవాలను ముగిస్తారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరం దేవస్థానం క్యాలెండర్‌ను ఈవో, చైర్మన్, పాలకమండలి సభ్యులు ఆవిష్కరించారు. సమావేశంలో పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితుడు వెలగపూడి శంకర్ బాబు, సభ్యులు సుకాసి సరిత, రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవానీదీక్షలు

నవంబరు 1 నుంచి 5 వరకు భవానీ మండల దీక్షల స్వీకరణ, 21న అర్ధ మండల దీక్షల స్వీకరణ జరుగుతాయి. డిసెంబరు 4 రాత్రి కలశజ్యోతి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. డిసెంబరు 11 నుంచి 15వ తేదీ వరకు భవానీ దీక్షల విరమణల కార్యక్రమాలు జరుగుతాయి. భవానీ దీక్షల విరమణల సందర్భంగా డిసెంబరు 11 నుంచి 15వ తేదీ వరకు దేవస్థానంలో జరిగే అన్ని ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలను రద్దు చేస్తారు.

ఆచరణాత్మక బోధన చేయాలి

» కొత్త ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ

పామర్రు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు ఆచరణాత్మకమైన బోధన అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. స్థానిక ప్రగతి డీఎస్సీ కోచింగ్ కేంద్రంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు క్వాంటమ్ కంప్యూటర్స్‌పై ఒకరోజు శిక్షణా శిబిరాన్ని గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం డిజిటల్ రంగంలో వృద్ధితో పాటు నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్‌లెర్నింగ్ క్వాంటమ్ విద్యరూపకల్పనకు పునాదిని అందిస్తోందన్నారు. రాష్ట్ర సమాచార సాంకేతిక ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ప్రత్యేక కార్యదర్శి బి.సుందర్ వర్చువల్‌గా విజయవాడ నుంచి పాల్గొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు బి.శివనాగేశ్వరరావు 30 రకాల ప్రయోగాత్మక పరికరాలతో



ఉపాధ్యాయులకు క్వాంటమ్‌పై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ బాలాజీ

భౌతికశాస్త్రాన్ని విద్యార్థులకు సులభతర పద్ధతులను వివరించారు. భౌతికశాస్త్రం, బ్లూప్రింట్ విశ్లేషణ వంటి అంశాలపై ఆ శాఖ సమన్వయకర్త శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. అనంతరం టెన్త్‌లో భౌతికశాస్త్రంలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణులైన 24 మంది విద్యార్థులకు కలెక్టర్ దుశ్శాలువా జ్ఞాపికలందించి సత్కరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి పీవీఎస్ రామారావు, అసిస్టెంట్ కలెక్టర్ ఫర్వీన్‌జాహిద్, డీవైఈవో పద్మరాణి, ప్రగతి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ సనకా పూర్ణచంద్రరావు, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

సీడ్.. స్పీడ్‌గా..

(5వ పేజీ తరువాయి)

సీడ్ యాక్సెస్ రోడ్డుకు భూములిచ్చారు. తమ స్వాధీనంలో ఉన్న భూముల్లో పనులు ప్రారంభించాలన్న ఉద్దేశంతో సీఆర్‌డీఏ అధికారులు ముందడుగు వేశారు. ప్రస్తుతం రెండోదశలో ఎర్త్‌వర్క్ పనులు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మిగులు భూములకు సంబంధించి రాజధాని రైతులు ముందుకు వస్తుండటంతో సీడ్ యాక్సెస్ రోడ్డును త్వరలోనే పూర్తి చేయొచ్చని భావిస్తున్నారు.

మరికొంతమంది రైతుల అంగీకారం

మొదట్లో భూములు ఇవ్వటానికిససేమిరా అన్న కొంతమంది రైతులు ఇప్పుడు ఓకే.. చెబుతున్నారు. భూ సమీకరణ కింద పెనుమాకలో 28.25 ఎకరాలు ఇవ్వడానికి 14 మంది రైతులు గురువారం అంగీకార పత్రాలు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అందించారు. అలాగే, ఉండవల్లిలో 22 మంది రైతులు 14 ఎకరాలు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఈ భూముల కారణంగా కొండవీడు వాగు వరద నిర్వహణ పనులతో పాటు పలు అంతర్గత రహదారుల అనుసంధాన పనులు చేపట్టడానికి అవకాశం ఉంటుంది.

ఖోఖో శిక్షణ ..

(5వ పేజీ తరువాయి)

ఆకాంక్షించారు. అన్నం పెట్టే క్రీడలకు వ్యాయామ ఉపాధ్యాయులు శాయశక్తుల కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబు నాయకత్వంలో క్రీడలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. స్పోర్ట్స్ కోటా మూడు శాతం పెంచి, ఉత్తమ క్రీడాకారులుగా రాణించిన వారికి డైరెక్టుగా ఉద్యోగాలలో చేరే అవకాశం కల్పించిందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు అందించే క్రీడా పరికరాలు మంత్రి లోకేశ్ పర్యవేక్షణలో పూర్తి నాణ్యతతో త్వరలో అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ఖో ఖో సంఘం అధ్యక్షుడు టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ఏ. సునీల, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వి.ఆర్. కిషోర్, కృష్ణాజిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి జి.రాంబాబు ఖో ఖో శిక్షకుడు శ్రీనివాసరావు, పీడీ ధనియాల నాగారాజు పాల్గొన్నారు.

పండుగల వేళ ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దీపావళి, ఛత్ పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను వివిధ ప్రాంతాల్లో నడుపుతోంది. ఈ మేరకు పీఆర్వో నుస్రత్ ఎం మంద్రూపకర్ వివరాలను వెల్లడించారు. 07497 తిరుపతి-సికింద్రాబాద్ ఈనెల17 శుక్రవారం నడుస్తుంది. 07498 సికింద్రాబాద్ - తిరుపతి 18వ తేదీ శనివారం నడుస్తుంది. 07213 విజయవాడ - సికింద్రాబాద్ ఈనెల 17, 18 శుక్ర, శనివారాల్లో నడుస్తుంది. 07214 సికింద్రాబాద్ - విజయవాడ ఈనెల 17, 18 శుక్ర, శనివారాలలో నడుస్తుంది. 07165 హైదరాబాద్-కొత్త భువనేశ్వర్ మంగళవారాల్లో నడుస్తుంది, నవంబర్ 4 నుంచి 25వ తేదీ వరకు నాలుగు సర్వీసులు నడుస్తుంది. 07166 కొత్త భువనేశ్వర్-హైదరాబాద్ బుధవారాలలో నడుస్తుంది. నవంబర్ 5నుంచి 26 వరకు నాలుగు సర్వీసులు నడుస్తుంది. 01438 ధర్మవరం-షోలాపూర్ ఈనెల 18వ తేదీ శనివారం బయలుదేరుతుంది. 06095 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - సత్రాగచి శుక్రవారం బయలుదేరుతుంది. 06096 సత్రాగచి-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఈనెల 18 శనివారం బయలుదేరుతుంది. 05541 దర్భంగ-యశ్వంత్‌పూర్ సోమవారాలలో బయలుదేరుతుంది. ఈనెల 20 నుంచి నవంబరు 17వరకు ఐదు సర్వీసులు నడుస్తుంది. 05542 యశ్వంత్‌పూర్-దర్భంగ గురువారాలలో నడుస్తుంది. ఈనెల 23 నుంచి నవంబరు 20 వరకు అయిదు సర్వీసులు నడుస్తుంది.



స్టేషన్‌లో టిక్కెట్లు తనఖీ చేస్తున్న టీసీలు

విజయవాడ డివిజన్లో టికెట్ తనిఖీలు

» రూ.1.22 కోట్ల అపరాధ రుసుం వసూలు

రైల్వేస్టేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే డివిజన్‌లో ఈనెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ టికెట్ చెకింగ్ డ్రైవ్‌లో అత్యధిక ఆదాయాన్ని నమోదు చేసింది. 17,017 కేసులు నమోదుచేసి రూ.1.22కోట్ల మేరకు జరిమానా వసూలు చేసింది. 13న రూ.37.03 లక్షలు, 14న రూ.40.26 లక్షలు, 15న గరిష్టంగా రూ.45.03 లక్షలు జరిమానాగా వసూలు చేశారు. ప్రతిరోజూ 716 మంది టికెట్ చెకింగ్ సిబ్బందిని రైళ్లు, స్టేషన్లలో మోహరించి, పూర్తి కవరేజ్ చేశారు. విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా బృందం అత్యుత్తమ పనితీరుకు అభినందనలు తెలిపారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బి.ప్రశాంత కుమార్, ప్రయాణికులు రైల్వే అధికారులతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు : జేసీ

విజయవాడ సిటీ : జిల్లాలో ఈ నెల 17న శుక్రవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేశామన్నారు. దీనిలో 159 రైతు సేవాల కేంద్రాల ద్వారా 3.03 లక్షల మెట్రిక్ టన్ను ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని మద్ధతు ధర పొందాలని సూచించారు.

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాలు

విజయవాడ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి షేక్ రుక్సానాసుల్తానాబేగం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అకౌంటెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డాక్టర్ చౌకీదారు, పార్ట్ టైం ఎడ్యుకేటర్, మ్యూజిక్ టీచర్, యోగా టీచర్, కుక్, హెల్పర్, హౌస్ కీపర్, నైట్ వాచ్‌విమెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 18-42 ఏళ్ల వయసున్న మహిళలు అర్హులని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ట వయసులో సడలింపు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 22 లోగా దరఖాస్తులు అందజేయాలని, దరఖాస్తు ఫారాలను ఎన్టీఆర్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తునకు జత చేసే ధ్రువీకరణ పత్రాల నకళ్లను గెజిటెట్ అధికారిచే అటెస్ట్ చేయించి కానూరులోని కార్మెల్ చర్చి రోడ్డులోని జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు.

అమరావతిలోఎలక్ట్రికల్ వాహనాలు

» సీఆర్‌డీఏ, ఈటీవో మోటార్స్ ఎంఓయూ

» మొదటి దశలో 300 త్రీవీలర్లు, 100కార్లు, 20 బస్సులు

విజయవాడ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో మహిళలు నడిపేందుకు వీలుగా ఎలక్ట్రికల్ త్రీవీలర్ వాహనాలను ప్రవేశపెట్టేందుకు సీఆర్‌డీఏ అధికారులు ఈటీవో మోటార్స్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నారు. సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఈటీవో మోటార్స్‌కు చెందిన ఎలక్ట్రికల్ త్రీవీలర్స్, బస్సులు వంటి వాటిని చంద్రబాబు పరిశీలించారు. రాష్ట్రంలో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు, రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ఇవి దోహదపడతాయన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఈటీవో మోటార్స్‌తో ఇటీవలే సీఆర్‌డీఏ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థ త్రీ వీలర్లతో పాటు అతి త్వరలో రాజధానితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రికల్ బస్సులు, క్యాబ్‌లు ప్రవేశపెడుతుంది. ఇటీవలే అధికారులు మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇచ్చారు. త్వరలోనే వారందరికీ జీవనోపాధికి వీలుగా ఈవీ త్రీవీలర్ వాహనాలను అందచేయనున్నారు. ప్రజారవాణా ద్వారా రాజధాని ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, రవాణా కనెక్టివిటీ మరింత బలోపేతమౌతాయని సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు అన్నారు. గన్నవరం విమానాశ్రయం, విజయవాడ, అమరావతి, గుంటూరు ప్రాంతాలను కలిపే మార్గం పరిశుభ్రమైన, సుస్థిర రవాణాకు ప్రతీకగా నిలుస్తుందన్నారు.



ఎలక్ట్రిక్ వాహనాలను పరిశీలిస్తున్న చంద్రబాబు

రూ.2.96కోట్ల స్కాలర్‌షిప్ పంపిణీ



» సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీ విద్యార్థులకు లబ్ధి

» విద్యానైపుణ్యాలు పెంచేందుకే

» ఎస్ఏజీటీఈ కార్యదర్శి లక్ష్మణరావు

కానూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు విద్యార్థులకు సిద్ధార్థ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్(ఎస్ఏజీటీఈ) ద్వారా స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్టు సంస్థ కార్యదర్శి పి.లక్ష్మణరావు చెప్పారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో గురువారం జరిగిన కార్యక్రమంలో వర్సిటీలో 2025-26విద్యా సంవత్సరంలో బీటెక్ చదివే 624 మంది విద్యార్థులకు రూ.2.96 కోట్ల స్కాలర్‌షిప్ డబ్బులను విద్యార్థుల ఖాతాకు పంపే ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా వర్సిటీ వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ మెరిటోరియల్ అభ్యాసకులకు నిరంతరం మద్దతు ఇవ్వాలనే ధ్యేయంతో స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వీసీ వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ వీసీ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ, విద్యాపరమైన నైపుణ్యం, ఆవిష్కరణలు, సమగ్ర విద్యార్థి అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

రీ ఎంట్రీతో హడల్

(5వ పేజీ తరువాయి)

తెలియక అయోమయస్థితిలో ఉన్నారు.

ముఖ్య నాయకుల సిఫారసుతో..

మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలోని ఓ నాయకుడి మద్దతుతో ఒక కాంట్రాక్టర్, బంధుత్వం సాకుతో జనసేన నాయకుడి సిఫారసుతో మరో కాంట్రాక్టర్ గుడివాడ మున్సిపాల్టీలోకి రీ ఎంట్రీ కొట్టారని టీడీపీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఐదేళ్ల వైసీపీ హయాంలో ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసిన వారికి మళ్లీ ఎలా అవకాశం ఇస్తారని టీడీపీ నాయకులు మండిపడుతున్నారు.

నెలరోజులుగా మళ్లీ మున్సిపాల్టీకి..

గత నెల రోజులుగా ఈ ఇద్దరు కాంట్రాక్టర్లు మళ్లీ మున్సిపాల్టీకి వస్తుండటంతో ఉద్యోగులు హడలిపోతున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా వారు సాగించిన దమనకాండను ఉద్యోగులు మరచిపోలేకపోతున్నారు. వారి ద్వారా ఇబ్బందులు పడ్డ వారు ఆగ్రహంతో ఉన్నారు. ఉద్యోగులందరూ ఏకతాటిపైకి వచ్చి నిరసనకు సమాయత్తమవ్వాలని నిశ్చయించుకున్నారు. వారిద్దరిని మున్సిపల్ కార్యాలయంలోకి రాకుండా బహిష్కరించాలని ఉద్యోగుల్లో డిమాండ్ రోజు రోజుకు పెరుగుతోంది. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కల్పించుకుని తమను ఇబ్బందులకు గురిచేసిన కాంట్రాక్టర్ల నుంచి తమకు రక్షణ కల్పించాలని మున్సిపల్ ఉద్యోగులు కోరుతున్నారు.

విజిలెన్స్

(5వ పేజీ తరువాయి)

నిర్మాణం చేశాడు. అయితే లబ్ధిదారులకు ఇచ్చిన సెంటున్నర స్థలంలో కాకుండా సగం స్థలంలోనే 10 గృహాలను నిర్మాణం చేశాడు. ఈ విషయం గతంలో కలెక్టర్ పరిశీలనకు వెళ్లిన సమయంలో వెల్లడైంది. దీంతో నిబంధనలు అతిక్రమించిన ఏఈని వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేయించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో అప్పటి నుంచి విధులకు హాజరు కాకుండా ఉన్న ఈ ఏఈ ప్రస్తుతం తనకు మళ్లీ ఏఈగా అదే మండలంలో ఉద్యోగం ఇవ్వాలని జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు అధికారులు చెప్పుకుంటున్నారు. గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయం విజిలెన్స్ అధికారుల విచారణ పూర్తయిన తర్వాత ఆయా మండలాల్లో పనిచేస్తూ పలు అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని గృహ నిర్మాణ సంస్థ అధికారులు అంటున్నారు.

కంచికచర్ల పంచాయతీలో నిధులు గోల్‌మాల్

» రూ. 27 లక్షల దుర్వినియోగం

» రంగంలోకి జిల్లా అధికారులు

» విచారణకు ఆదేశించిన డీపీఓ..

» ఇద్దరికి డీఎల్‌పీవో నోటీసులు

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల)

పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలో మేజర్ గ్రామపంచాయతీలలో ఒకటైన కంచికచర్ల గ్రామ పంచాయతీలో నిధుల గోల్‌మాల్ వ్యవహారంవెలుగుచూసింది. కంచే చేను మేసిన చందాన ఉద్యోగులే ఈ 'ధన'కార్యానికి ఒడిగట్టునట్టు తెలుస్తోంది. రూ. 27లక్షల మేర నిధులు దుర్వినియోగమయ్యాయని తెలుస్తోంది. గోల్‌మాల్ వ్యవహారంతో అధికారులు రంగం రంగంలోకిదిగి బాధ్యులైన వారికి నోటీసులు ఇవ్వటం కలకలం రేపుతోంది. విచారణ పూర్తయితేగానీ నిధులు విలువెంత అన్నదానిపై స్పష్టత వస్తుంది.

● కంచికచర్ల మేజర్ గ్రామ పంచాయతీలో భారీగా నిధులు గోల్‌మాల్ అయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంలో వివిధ పద్దుల రూపేణా వసూలుచేసిన సొమ్ము పంచాయతీ ఖజానాకు జమకాలేదు. మొత్తం రూ.27లక్షలకు పైగా నిధులను ఇద్దరు ఉద్యోగులు దుర్వినియోగం చేసినట్టుగా అధికారులు గుర్తించారు. నిధుల కైంకర్యంపై విచారణ జరిపేందుకు డివిజనల్ పంచాయతీ అధికారి శుక్రవారం ఇక్కడకు వస్తున్నారు. విచారణకు హజరు కావల్సిందిగా ఇద్దరు ఉద్యోగులకు నోటీసులు ఇచ్చారు.

● పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఎస్‌కే నాగులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ పద్దుల కింద వసూలుచేసిన సొమ్ము రూ. 16,08,904లు ఖజానాకు జమ చేయలేదు. బిల్ కలెక్టర్‌గా పనిచేసిన జంగం వెంకట గుప్తా బిల్ కలెక్షన్ రిజిష్టరు (బీసీఆర్) దాఖలా వసూలు చేసిన సొమ్ము రూ.11,10,280లు ఖజానాకు జమ చేయలేదు. ఇద్దరూ పంచాయతీకి చెందిన మొత్తం సొమ్ము రూ. 27,19,184లు దుర్వినియోగం చేశారు. ప్రస్తుతం నాగులు జగ్గయ్యపేట మండలం గండ్రాయి పంచాయతీలో పనిచేస్తుండగా, వెంకట గుప్తా మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు పంచాయతీలో పనిచేస్తున్నాడు. సొమ్మును పంచాయతీకి జమ చేయాల్సిందిగా ఈ ఏడాది ఫిబ్రవరి 14న అప్పటి పంచాయతీ కార్యదర్శి వీరికి నోటీసులిచ్చారు. ఇప్పటి వరకు ఒక్కపైసా జమచేయలేదు. నిధుల దుర్వినియోగం విషయమై విచారించేందుకు శుక్రవారం విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి సమక్షంలో విచారణకు ఇద్దరు ఉద్యోగులు తప్పనిసరిగా హజరు కావల్సిందిగా ఆదేశించారు. అయితే తాము నిధులు దుర్వినియోగం చేయలేదని, పంచాయతీలో వివిధ పనుల నిమిత్తం ఖర్చు చేశామని, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఇద్దరు ఉద్యోగులు చెపుతున్నట్టు సమాచారం.

● పంచాయతీ నిధుల దుర్వినియోగం స్థానికంగా చర్చనీయాంశమైంది. గతంలోనూ పంచాయతీ సొమ్ము భారీగా గోల్‌మాల్ అయింది. రాజకీయ ఒత్తిళ్ల వల్ల పూర్తిస్థాయిలో విచారణ జరగలేదు. కొన్నేళ్లుగా పంచాయతీలో చేతివాటం ప్రదర్శించటం, అందినకాడికి దోచుకోవటం కొందరు ఉద్యోగులకు అలవాటుగా మారింది. పన్నులు, అద్దెలు వసూలు చేసిన తర్వాత తక్షణమే రశీదులు ఇవ్వటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేయాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.





డీఎల్‌పీవో ఇచ్చిన విచారణ నోటీసు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన యార్లగడ్డ సుచిత్ర



పెనమలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబును సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయడానికి విశేష కృషి చేసి రాష్ట్ర పురోభివృద్ధికి బాటలు వేసినందుకు ముఖ్యమంత్రికి సుచిత్ర కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆమె జ్ఞాపికను అందజేశారు.

బందరు కాల్వపై వంతెన

- రూ.49.6 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు
- నెరవేరబోతున్న కాల్వ కట్టవాసుల కల
- బందరు రోడ్డుకు సులభంగా చేరుకొనేందుకు అవకాశం

(పెనమలూరు, ఆంధ్రజ్యోతి)

ఎన్నో ఏళ్లుగా పోరంకి కాల్వ కట్టవాసులు ఎదురు చూస్తున్న బందరు కాల్వపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. దీంతో కాల్వ కట్టవాసుల కల నెరవేరబోతోంది. కాల్వ కట్టవాసులు వంతెన పూర్తయిన పక్షంలో విజ్ఞాన్‌భారత్ రోడ్డు మీదుగా సులభంగా బందరు రోడ్డును చేరుకోవచ్చు.

బందరు రోడ్డు నుంచి ఇతర ప్రాంతాల ప్రజలు కాల్వ అవతల ఉన్న ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి వంతెన మీదుగా సులభంగా చేరుకోవచ్చు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న వంతెన నిర్మాణానికి గత టీడీపీ హయాంలోనే ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి రావడంతో వంతెన పనులు అటకెక్కి పట్టించుకొనే నాధుడే లేకుండా పోయాడు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి వంతెన నిర్మాణానికి సంబంధించి ఎమ్మెల్యే కలెక్టర్‌తో సంప్రదింపులు జరపగా నెల క్రితం వంతెన నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

కలెక్టర్ నివేదికను పరిశీలించిన కూటమి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి పచ్చజెండా ఊపి రూ.49.6కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.

బాక్సింగ్ పోటీల్లో ఉయ్యూరు విద్యార్థులకు పతకాలు



బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

ఉయ్యూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాక్సింగ్ పోటీల్లో ఉయ్యూరు విద్యార్థులు పతకాలు సాధించారు. ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 బాలుర 46-48 కేజీల విభాగంలో జడ్పీ స్కూల్ విద్యార్థులు అనంతకుమార్ బంగారు పతకాన్ని, 28-30 కే జీల కేటగిరిలో షణ్ముఖ్‌సాయి కాంస్య పతకం సాధించారు. అండర్ -17 బాలికల 46-48 కేజీల కేటగిరిలో ఫ్లోరా స్కూల్ విద్యార్థిని సిద్రజబీన్ సిల్వర్ పతకం సాధించింది. కర్ణాటకలో నవంబరులో జరిగే జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించిన అనంతకుమార్ పాల్గొంటారని ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ వైవీఎస్ ఉమామహేశ్వరరావు తెలిపారు. కోచ్ సూరి, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను అభినందించారు.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి : ఎమ్మెల్యే బోడె



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వమంటేనే అభివృద్ధి, సంక్షేమమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకిలో రూ.40.7 లక్షలతో నిర్మించిన కో-ఆపరే సిమెంటు రోడ్డును ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. తాను ఉప సర్పంచిగా ఉన్నప్పుడు దాదాపు 70 రోడ్లను నిర్మించామన్నారు. ఎమ్మెల్యేగా లక్షల నిధులతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15నెలల కాలంలోనే అభివృద్ధి పనులు ఊపందుకున్నాయని తెలిపారు. టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, తాతపూడి గణేష్, యేకుల విజయేంద్ర, సంగెపు రంగారావు, మహిళా నేతలు పాల్గొన్నారు.

నూకల సాంబశివరావుకు ఘన సత్కారం



సాంబశివరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వాసవీక్లబ్ సభ్యులు

ఉయ్యూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వ్యాపార, సామాజిక సేవా కార్యక్రమాలకు గాను బర్లింగ్టన్ స్టేట్ యూనివర్సిటీ నుంచి నూకల సాంబశివరావు డాక్టరేట్ తీసుకోవడం వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘానికి గర్వకారణమని వక్తలు పేర్కొన్నార. బర్లింగ్టన్ స్టేట్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ తీసుకున్న సాంబశివరావును ఆర్యవైశ్యసంఘ సభ్యులు గురువారం ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వాసవీక్లబ్ పూర్వపు అధ్యక్షుడు బాబ్జి, ప్రస్తుత అధ్యక్షుడు హేమంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి వీరాంజనేయులు, నాగరాజు, నేరెళ్ల తేజ, పూర నా గిన్, పూర కిషోర్, దోరెడ్ల శ్రీను, యండూరి గోపాల్, కంతేటి శ్రీను, గ్రంధి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ వర్సిటీలో వరల్డ్ ఫుడ్ డే

కానూరు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వరల్డ్ ఫుడ్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. వంటకాల తయారీ పోటీలు నిర్వహించగా విద్యార్థులు వివిధ ప్రాంతాల సంప్రదాయ వంటకాలను తయారు చేసి వాటిలో పోషకవిలువలు, ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శివరాంప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు. ఉత్తమ వంటకాలు చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

సీఎం చంద్రబాబు కృషికి నిదర్శనమే గూగుల్ డేటా సెంటర్

ప్రసాదంపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రావడానికి సీఎం నారా చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృషి కారణమని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనేరు నాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో డిజిటల్ ఇన్నోవేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ రంగాల్లో కొత్త మార్పులు ఉంటాయన్నారు.

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి

ఉయ్యూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేసేవారు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని ఉయ్యూరు ఆర్డీవో బి.హేలా షారోన్ అన్నారు. వీరమ్మ ఆలయ ప్రాంగణంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు స్థలాన్ని గురువారం ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఉయ్యూరు కమిషనర్ జాస్తి రామారావు, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

కానూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆధునిక సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అన్నారు. కళాశాల ఆవరణలో గురువారం విద్యార్థులకు రివిట్ సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ తరగతులు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన శివాజీబాబు మాట్లాడుతూ విద్యార్థులను నిర్మాణ రంగంలోని అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీని ద్వారా ఉద్యోగాల్లో పోటీని తట్టుకొని నిలబడతారని, వారి నైపుణ్యాలు మెరుగుపడతాయని ఆయన వివరించారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి. జగదీష్ మాట్లాడుతూ రివిట్ అనేది 3డీ మోడలింగ్, డిజైన్ సహకారం, క్వాంటిటీ ఎస్టిమేషన్‌లో విప్లవాత్మక మార్పులు తెచ్చి న సాఫ్ట్‌వేర్ అన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కోగంటి శ్యామ్‌ప్రకాష్ ప్రసంగిస్తూ మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు జరుగుతాయని, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తేలప్రోలులో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మాదేవి

మహిళల ఆరోగ్యాభివృద్ధికి సమతుల ఆహారం అవసరం

ఉంగుటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యాభివృద్ధికి సమతుల ఆహారం అవసరమని, అన్ని రకాల పోషక విలువలతో కూడిన నాణ్యమైన పౌష్టికాహారాన్ని ప్రతిరోజూ తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ పెదఅవుటపల్లి, తేలప్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి అన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీకేంద్రాల్లో గతనెల రోజులుగా నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవాలు గురువారంతో ముగిశాయి. తేలప్రోలులో నిర్వహించిన గ్రామస్థాయి ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పద్మాదేవి మాట్లాడుతూ అంగన్వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీలు స్వయంగా తయారుచేసిన వంటకాలను రుచి చూసి, గర్భిణులు, తల్లులకు అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, తల్లులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఐలో శిక్షణకు 22 మంది ధనేకుల విద్యార్థుల ఎంపిక



ఏఐ శిక్షణకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

పెనమలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల మూడో సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులు 22 మంది ఏడాది పాటు కృత్రిమ మేధ (ఏఐ)పై ఉచితంగా శిక్షణ పొందేందుకు ఎంపికయ్యారు. వట్టికూటి ఫౌండేషన్, కాలిబో సంస్థలు నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో విద్యార్థులు ఎంపికయినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. విజయవాడ నోవాటెల్ హోటల్‌లో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఇతర పరిశ్రమల ప్రతినిధులు విద్యార్థులతో సమావేశమై అనుభవాలను పంచుకొన్నారు. శిక్షణ ద్వారా విద్యార్థులు నూతన తరం టెక్నాలజీతో ం నైపుణ్యాలను మెరుగుపరచుకొని భవిష్యత్తులో మంచి ఉద్యోగావకాశాలను పొందుతారని ప్రిన్సిపాల్ రవి కడియాల తెలిపారు. శిక్షణకు ఎంపికయిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ డీకేఆర్‌కె రవిప్రసాద్ తదితరులు అభినందించారు.

షిరిడీ సాయిబాబాకు విశేష పూజలు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. మందిరం అభివృద్ధి కమిటీ చైర్మన్ కొల్లి వెంకట్రావు పర్యవేక్షణలో బాబాకు సుప్రబాత సేవ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.



జిల్లా కౌన్సిలర్‌గా ఎన్నికైన సరళకు మొక్క అందజేస్తున్న డీపీఆర్‌టీయూ నేతలు

డీపీఆర్‌టీయూ జిల్లా కౌన్సిలర్‌గా సరళ

గన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎంవిఎస్ నాగేంద్రరావు అన్నారు. గన్నవరం మండల శాఖ కార్యవర్గ సమావేశం ఆర్ఎస్ నాయక్ అధ్యక్షతన గురువారం జరిగింది. నాగేంద్రరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో డీపీఆర్‌టీయూ జిల్లా కౌన్సిలర్‌గా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఎం.సరళను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శి రాజేష్, కోశాధికారి గోపి, నాగశేషయ్య, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం



గురుకుల పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ జేజమ్మ

గన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలోని భోజనశాలను ఆత్కూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో కలసి సర్పంచ్ అరేపల్లి జేజమ్మ గురువారం పరిశీలించారు. ఆర్వో వాటర్ ప్లాంట్ ఫిల్టర్లను చూశారు. ఎప్పటికప్పుడు ఫిల్టర్లను శుభ్రం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ జేజమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతకు తగిన ప్రాధాన్యత నివ్వాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.సురేష్, బి.జ్యోతి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎన్ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధి పనుల పరిశీలన

కంకిపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ ప్రధాన రహదారి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని కంకిపాడు క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ సాధారణ నిధులు రూ. 23 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మండల పరిషత్ ప్రధాన రహదారి సుమారు. 4.5 మీటర్ల వెడల్పు అభివృద్ధి చేయాల్సి ఉండగా ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మీ రహదారిని ఐదు మీటర్ల మేరకు అభివృద్ధి చేయాలని కోరడంతో అందుకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బధిర విద్యాలయానికి నిత్యావసర సరుకుల విరాళం



ఆదిత్య బధిర విద్యాలయానికి పరికరాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ నేతలు

హనుమాన్‌జంక్షన్,అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య బధిర విద్యాలయానికి ఎన్నారై మునగాల రవికుమార్, అనిత దంపతులు రూ.20 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను గురువారం విరాళంగా అందజేశారు. లయన్స్ క్లబ్ నేత మత్తి రాంబాబు సహకారంతో దాతలు తమ కుమార్తె భవ్య జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యాలయం నిర్వాహకులు ఆకుల వెంకటరమణకు సరుకులు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్ చక్రవర్తి, నేతలు అక్కినేని రాఘవేంద్రరావు, మేడికొండ బుచ్చిబాపయ్య, నందిగం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ఉయ్యూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సమస్త జీవరాశులకు ప్రాణాధారమైన చెట్లను కాపాడడంతో పాటు మొక్కలు నాటి సంరక్షించడం అలవాటుగా చేసుకోవాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గుళ్లపల్లి కోటేశ్వరరావు అందజేసిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. జమ్ అకాడమి విష్ణు సేవాసమితి తరపున మొక్కల పెంపకం, మానవతా విలువలు, పర్యావరణ విశిష్టత తెలియజేస్తూ బ్రోచర్ విడుదల చేశారు. హెచ్ఎం నాగేశ్వరరావు, కార్టూనిస్ట్ హరికృష్ణ, రిటైర్డ్ డీజీఎం ప్రసాద్, ద్విజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన బ్రోచర్ విడుదల

కానూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బ్రెస్ట్ కేన్సర్ అవగాహన నెలను పురస్కరించుకొని రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం కానూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయభాస్కర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 26, 27 తేదీల్లో తాడిగడప మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు కేన్సర్ మొబైల్ వ్యాను ద్వారా ఉచితంగా రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

'మానవత'కు విరాళం

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మి డెంటల్ క్లినిక్ డాక్టర్ ప్రశాంతి విశిష్ట సేవలు అందిస్తున్న జంక్షన్ మానవత సంస్థకు గురువారం రూ.5వేలు విరాళం అందించారు. తండ్రి ఆంద్ర నాగేశ్వరరావు జ్ఞాపకార్థం తనవంతు సాయంగా మానవత సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు చేతులు మీదుగా విరాళం అందజేశారు. దాతను మానవత నిర్వాహకులు గణేష్, జేవీవీ సత్యనారాయణ, వేగిరెడ్డి సూర్యనారాయణ, ఘంటా ఇందిరాదేవి, సత్యనారాయణ అభినందించారు.

ద్విచక్ర వాహనం అపహరణ

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరానగర్ కాలనీలో ఇంటి ముందు పెట్టిన పల్సర్ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దుండగులు అపహరించారు. బాధితుడు పి. ప్రేమ్ కుమార్ ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.సురేష్ తెలిపారు. మంగళవారం రాత్రి ఇంటి దగ్గర పార్కింగ్ చేసి నిద్ర పోగా . తెల్లవారు జామున చూడగా వాహనం కనిపించలేదని బాధితుడు పేర్కొన్నారు.

రిటైర్డ్ రైల్వే ఉద్యోగి దుర్మరణం

గన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై గన్నవరం రైతు బజార్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ రైల్వే ఉద్యోగి దుర్మణం చెం దాడు. బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామానికి చెం దిన గరికపాటి సుబ్బారావు(66) గన్నవరం రైతు బజార్‌లో కూరగాయలు తీసుకుని బయటకు వచ్చాడు. ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీకొనడంతో రోడ్డుపైన పడిపోయాడు. లారీ చక్రాలు సుబ్బారావు తలపై ఎక్కడంతో నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్సై శ్రీధర్ తెలిపారు.

నిరుపేదకు తోపుడు బండి

పెనమలూరు : కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామానికి చెందిన వేముల దుర్గకు జీవనోపాధి నిమిత్తం యువనేత బోడె వెంకట్రామ్ తోపుడు బండి అందజేశారు. వెంకట్రామ్ మాట్లాడుతూ బడుగుల జీవనోపాధికి సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన వ్యక్తులు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం : ఎంపీడీవో

గుడ్లవల్లేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సకాలంలో సేవలు అందించాలని గుడ్లవల్లేరు ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల, జూనియర్ అసిస్టెంట్‌ల తో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో పారిశుధ్యం స్వచ్ఛతా కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించేలా చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా విధులు నిర్వహించాలని ఇమ్రాన్ సూచించారు.



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఇమ్రాన్

దారులు దారుణం .. ప్రయాణం నరకం

- రహదారులు ధ్వంసం
- గోతుల్లో చేరిన వర్షపు నీటితో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

(కూచిపూడి - ఆంధ్రజ్యోతి): కూచిపూడి - మొవ్వ ప్రధాన రహదారిలో అడుగడుగునా గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికితోడు చినుకు పడితే గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోయి ఎక్కడ గొయ్యి ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. వాహనదారులు, పాదచారులు ఈ రహదారులపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తుంది. కారకంపాడు, కొండవరం రహదారి ఇటీవల కురుస్తున్న వర్షాలకు చిత్తడిగా మారి రోడ్డు ప్రమాదాలు నిత్య కృత్యమయ్యాయి. కూచిపూడి - బార్లపూడి రహదారిలో అడుగడుగునా గుంతలే దర్శనమిస్తున్నాయి. మొవ్వ - కూచిపూడి బస్టాండ్ ప్రాంతాలు కొద్దిపాటి వర్షానికే చెరువులు తలపిస్తున్నాయి. కొండవరం - పెదముత్తేవి రహదారి అస్తవ్యస్తంగా మారటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సదరు అధికారులు స్పందించి రహదారుల గుంతలు పూడ్చి ప్రమాదాలు అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే రహదారి మరమ్మతులు చేపడతాం

కూచిపూడి నుంచి మొవ్వ వరకు 2.7 కిలోమీటర్ల రహదారి మరమ్మతులకు రూ. 3.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. టెండర్లు సైతం పూర్తయ్యాయి. వర్షాలు తగ్గుముఖం పట్టిన తార్వాత రహదారికి మరమ్మతు పనులు చేపడతాం.

సురేష్, ఆర్అండ్‌బీ జేఈ



కూచిపూడి - మొవ్వ రహదారి దుస్థితి



కూచిపూడి - బార్లపూడి రహదారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.శివనాగమణి

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తప్పనిసరి

పెదపారుపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహాన్ని తీసుకోవాలని సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి పేర్కొన్నారు. వెంట్రప్రగడలో అంగన్‌వాడీ-2 కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి అధ్యక్షతన గురువారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిషోర బాలికలు, బాలింతలు, గర్భిణులు పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలన్నారు.

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా రవికుమార్

పమిడిముక్కల : సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో రాష్ట్ర కోఆర్డినేటర్‌గా పమిడిముక్కల మండలం తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సీహెచ్ రవికుమార్ నియమితులయ్యారు. కవి, రచయిత, ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు, సాహిత్యపు సత్యాన్వేషణలో, అభ్యుదయ భావజాలం వెలుగులు నింపే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా పేరొందిన రవికుమార్‌ను అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నియమిస్తూ సంస్థ జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరీభూషణ, రాష్ట్ర అధ్యక్షుడు హరి సర్వోత్తమనాయుడు నియమాక ఉత్తర్వులు అందజేశారు.



భూమి మ్యాప్ పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి

జనార్దనపురంలో భూమి రీసర్వే

నందివాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జనార్దనపురంలో భూమి రీ సర్వే తనిఖీల్లో భాగంగా మంగళగిరి నుంచి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి గురువారం భూమి రికార్డులు తనిఖీ చేసినట్టు మండల తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి జనార్ధనపురం రైతులతో భూమి రికార్డుల గురించి మాట్లాడినట్టు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రీ సర్వేయర్ రాహేలమ్మ, డీటీ కిషోర్, ఆర్ఐ గణేష్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

మొవ్వలో 9 బాణసంచా దుకాణాలకు అనుమతి

కూచిపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా అమ్మకాలు చేసేందుకు మొవ్వలో 9 దుకాణాలకు అనుమతి ఇచ్చినట్లు తహసీల్దార్ మస్తాన్ తెలిపారు. ఈ దుకాణాల ఏర్పాట్లకు గురువారం అధికారుల బృందం స్థలాలను పరిశీలించి ఎంపిక చేశారు. పెదపూడి, పెడసనగల్లు రోడ్డులో గల వర్తక సంఘం కల్యాణ మండపంలో మూడు దుకాణాలు, నిడుమోలు జడ్పీ పాఠశాల ఆవరణలో రెండు, కోసూరు కో-ఆపరేటివ్ సొసైటీ ప్రాంగణంలో ఒకటి, కాజ జడ్పీ పాఠశాల ప్రాంగణంలో ఒకటి, మొవ్వ కల్యాణ మండపంలో ఒకటి, మొవ్వ - కూచిపూడి రోడ్డులో మరో దుకాణానికి అనుమతులు మంజూరు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విశ్వనాథ్, మొవ్వ అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు, విద్యుత్ శాఖ ఏఈ రమేష్, ఆర్ఐ విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడిలో బాణసంచా దుకాణాల స్థలం పరిశీలిస్తున్న అధికారులు

ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు నిబంధనలు పాటించాలి

- ఎంఈవో -1 రజనీ

గుడివాడ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేయాలని ఎంఈవో -1 రజనీ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో-1, ఎంఈవో-1 బాలాజీల ఆధ్వర్యంలో ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల మేనేజ్‌మెంట్లకు వివిధ అంశాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కట్టిన ఫీజులకు రసీదులు అందించాలన్నారు. ఎంఈవో-2 బాలాజీ మాట్లాడుతూ పాఠశాలలో ఎవరైనా ఫీజు కట్టని వారిని విద్యార్థులు వేరే పాఠశాలలో జాయిన్ అయితే ఆ విద్యార్థి పేరును తొలగించాలని తెలిపారు. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని తెలిపారు. పాఠశాలలకు అన్ని వసతులు కల్పించటానికి మేనేజ్‌మెంట్ కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సమానంగా చూస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-1 రజనీ

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన

గుడివాడ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తను సక్రమంగా ప్రతి రోజూ తీయటానికి డ్వాక్రా గ్రూపు సభ్యులు సహకరించాలని ఎంపీడీవో విష్ణుప్రసాద్ అన్నారు. గురువారం చెత్త నుంచి సంపద సేకరణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మహిళలు రోడ్లపై చెత్త వేయకుండా చెత్తను పంచాయతీ సిబ్బందికి అందించాలన్నారు. రహదారి వెంబడి చెత్తాచెదారం వేయకుండా, ఇళ్ల వద్ద పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలన్నారు. ప్లాస్టిక్ నిరోధానికి కృషి చేయాలని సూచించారు. సరుకులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా సంచులు తెచ్చుకుని వాటిని మరలా వినియోగించుకోవాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



దొండపాడులో చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వాచ్‌మెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పామర్రు : పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న వాచ్‌మెన్ పోస్టు భర్తీకి అర్హతగల వారినుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ అరుణప్రభ గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు.

హాకీ పోటీలకు పమిడిముక్కల విద్యార్థులు

పమిడిముక్కల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అండర్ 14 హాకీ పోటీలకు పమిడిముక్కల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన పోటీలలో పాల్గొన్న డి.సాయిశ్రీ, పి.దేవిశ్రీ, బి.సాయిమహాలక్ష్మి, వై.విజయలక్ష్మి, ఎ.జిగ్నేశ్, ఎస్.లక్ష్మీనరసింహస్వామి విశేష ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెర్సీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నవంబరులో కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఈవీ నారాయణను ప్రధానోపాధ్యాయురాలు మెర్సీ, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీకుమార్, రామకృష్ణ, రామాంజనేయులు , కుబేర ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.



హాకీ పోటీలకు ఎంపికైన పమిడిముక్కల విద్యార్థులు

ఖాతాదారులకు మెరుగైన సేవలే ధ్యేయం

గుడివాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రజలకు మరింత చేరువ కావాలని, బంగారంపై తక్కువ వడ్డీతో ఖాతాదారులకు రుణాలను అందిస్తోందని డీఎస్పీ ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సత్యనారాయణపురంలోని కిన్నెర కాంప్లెక్స్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఆభరణాలపై రుణమేళాను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన డీఎస్పీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రాజెక్టు హెడ్ జె.కించిత్, బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ గుడ్లవల్లేటి మోహన్‌కుమార్, బ్యాంకు సిబ్బంది తేజ, పాల్గొన్నారు

ఘనంగా అయ్యప్ప ఇరుముడులు

పామర్రు : హరిహర పుత్రుడు అయ్యప్పను దర్శించుకునేందుకు అయ్యప్ప దీక్షాపరులు స్థానిక అయ్యప్ప ఆలయంలో గురుస్వాములతో ఇరుముడులు కట్టించుకుని శబరిగిరిలో కొలువైయున్న అయ్యప్పను దర్శించుకునేందుకు గురువారం పయనమయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్పశరణు ఘోషలతో అయ్యప్ప ఆలయం మార్మోగింది. బొగ్గవరపు సాయిబాబు గురుస్వామి ఇరుముడుల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన ఆధ్వర్యంలో వారిశిష్యబృదం 130మంది శబరిగిరికి శిరస్సున ఇరుముడులు ధరించి బయలు దేరారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

గుడ్లవల్లేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకొన్న గుడ్లవల్లేరుకు చెందిన ఇరువురు ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. గురువారం మండలపరిషత్ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రాల ఎంపీయుపీ పాఠశాల ఉపాధ్యాయుడు కలపాల రత్నం, గుడ్లవల్లేరు రెండు పాఠశాల ఉపాధ్యాయిని ఎ.వి.వరలక్ష్మి లను ఎంఈఓ-2 జి.గోపాలరావు ఆధ్వర్యంలో సన్మానించారు. సమీక్షలో మధ్యాహ్న భోజనం నిర్వహణ, విద్యార్థులకు చేసిన కిట్‌ల పంపిణీ, ఎఫ్ఏ 1 మార్కుల నమోదు, ఎఫ్ఏ2 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడం పై ఎంఈవో సమీక్షించారు.



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

గుడివాడ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

- రావి వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

గుడివాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : గుడివాడను మరింత అభివృద్ధి చేయాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధి మాస్టర్ ప్లాన్, విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగంగా మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ అధ్యక్షతన ఏపీసీఆర్‌డీఏ అధికారులు, ఆర్.వి ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ తరుపున హర్భజన్ సింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ ప్రజా అభిప్రాయాలను పూర్తిగా పరిగణలోకి తీసుకుని రానున్న కాలంలో సీఆర్‌డీఏ అధికారులు కార్యచరణ రూపొందించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ మనోహర్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణతో పాటు స్థానిక నాయకులు, పట్టణ ప్రముఖుల సలహాలను తీసుకోనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, నాయకులు దింట్యాల రాంబాబు, లింగం ప్రసాద్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం

గుడివాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : పుల్లలపాడు శ్మశానం నుంచి వచ్చే వ్యర్థాలను బయటకు వేయకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ ఆదేశించారు. గురువారం స్థానిక 6వవార్డులో పర్యటించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

గుడివాడ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ, ఏపీ వాలంటరీ బ్లడ్ బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన స్థానిక సత్యనారాయణపురంలోని ఐఎంఏ హాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు

గుడివాడ : అదనపు కట్నం తీసుకురావాలంటూ భర్త, అత్తమామలు, ఆడపడుచులు తనను వేదిస్తూ, తీవ్రంగా హింసిస్తున్నారంటూ భార్య టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. స్థానిక సత్యనారాయణపురానికి చెందిన నాగపూజితకు రేపల్లె మండలం పెనుమూడికి చెందిన కిరానీ స్వామి వర్మతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వైవాహిక జీవితంలో వీరికి ఇద్దరు పిల్లలు. తొమ్మిది నెలలుగా నాగపూజిత గుడివాడలోని పుట్టింట్లో ఉంటోంది. ఈ నెల 14వ తేదీన గుడివాడ వచ్చిన స్వామివర్మ అదనపు కట్నం కావాలంటూ తనపై, తన తల్లిపై దాడి చేశాడని భార్య పూజిత టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై లోవరాజు తెలిపారు.

జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలి

- తలారి సుబ్బారావు

పామర్రు, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):ప్రజలకు ఆర్థిక వెసులబాటు కల్పించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్ ప్రయోజనాలపై సమాజంలో ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని ఉయ్యూరు మోటారు ట్రాన్స్‌పోర్టు అధికారి తలారి సుబ్బారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో గురువారం ఎంపీడీవో కార్యాలయ ఏవో మారుతిరావు అధ్యక్షతన రవాణాశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు, వాహనదారులకు సూపర్ జీఎస్టీ పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ, ప్రభుత్వం అమల్లోకి తీసుకోచ్చిన ఈసూపర్ జీఎస్టీతో రవాణా రంగానికి లాభదాయకమైన మేలు జరుగుతుందన్నారు. నూతన జీఎస్టీ వల్ల 28నుంచి 18శాతానికి తగ్గించడంతో భారీ వాహనాలైన లారీటైర్లు, వాహనం చాసిస్ 1500సీసిలోపు కార్లు,1200సీసిలోపుగల పెట్రోల్ ఎలిక్ట్రికల్ కార్లు తగ్గయన్నారు. దీనితోపాటు వాహన బీమా ప్రీమియం థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ పై 12నుంచి ఐదుశాతం జీఎస్‌టి తగ్గడం వల్ల అన్నిరకాల వాహన యజమానులకు లాభదాయకంగా ఉంటుందని వివరించారు. సహయ మోటారు ఇన్స్‌పెక్టార్ షేక్ అయేషాస్మాని, ఏఎంసీ ఛైర్మన్ జన్ను శోభనబాబు, డైరక్టర్ నూకవరపు వీరాంజనేయులు గ్రామపంచాయతీ ఈవో అబ్దుల్ సలీం, జీఎస్టీ చాంపీయన్లు పి.రాజేశ్వరి, రవాణాశాఖ అధికార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో ర్యాలీలో పాల్గొన్న జీఎస్టీ అధికారులు

గుడివాడ : స్థానిక ఆటోనగర్‌లో రవాణ శాఖ, జీఎస్టీ అధికారుల ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జీఎస్టీపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణ శాఖ ఇన్‌స్పెక్టర్ సంగీతరావు, కమర్షియల్ ట్యాక్స్ అధికారి సునీతలు మాట్లాడుతూ తగ్గిన జీఎస్టీ ధరల గురించి అందరికి అవగాహన అవసరమన్నారు. లారీ వర్కర్స్, ట్రాక్టర్స్ ఆటో వర్కర్స్ యానియన్ నాయకులు అవగాహన కల్పించేందుకు ఆటోనగర్‌లో అవగాహన సదస్సును ఏర్పాటు చేశామన్నారు. . ఈ సందర్భంగా తగ్గిన జీఎస్టీ గురించి పలురకాలు సూచనలు, సలహాలనందించారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ సభ్యులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



పామర్రులో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సుబ్బారావు

జోగి చట్టం నుంచి తప్పించుకోలేడు : వేదవ్యాస్



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం కేసులో అడ్డంగా దొరికిపోయిన మాజీ మంత్రి జోగి రమేష్ చట్టం నుంచి తప్పించుకోలేడని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దక్షిణాఫ్రికా నుంచి నకిలీ మద్యం ఫార్ములాను తీసుకువచ్చి అక్రమ వ్యాపారం చేసి దొరికిపోయిన జోగి, ఇంకా బొంకడం ఆశ్చర్యంగా ఉందన్నారు. జనార్ధనరావును మోసం చేసి నకిలీ మద్యం తయారీ కేసులో దొరికిన జోగి రమేష్‌పై ప్రభుత్వం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో చిలంకుర్తి పృథ్వీప్రసన్న, కొండా పాల్గొన్నారు.



టీసీఎస్‌లో ఉద్యోగాలకు ఎంపికైన విజయక్రాంతి విద్యార్థులు

27 మందికి టీసీఎస్‌లో ఉద్యోగాలు

చల్లపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విజయక్రాంతి డిగ్రీ కళాశాల విద్యార్థులు 27 మంది ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ టీసీఎస్‌లో ఉద్యోగాలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ దుట్టా శివరామప్రసాద్ తెలిపారు. అడపా నవ్యశ్రీ, బొర్రా వైష్ణవి, గోళ్ల వాసవి ప్రజ్ఞ, యార్లగడ్డ హర్షిత ప్రియ, బుర్రె ఐశ్వర్యయ్య, కమతం అస్మిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. 21 మంది విద్యార్థులు 60 శాతం కంటే అధిక మార్కులు సాధించారన్నారు. విజేతలను కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ దుట్టా శివరామప్రసాద్, అధ్యాపకులు ఎంఎస్ఆర్, మత్తి సూర్యప్రసాద్, ఇన్‌చార్జి కె.సత్యనారాయణ అభినందించారు.

చంద్రబాబు, లోకేశ్ కృషితోనే విశాఖకు గూగుల్

• టీడీపీ సీనియర్ నేత గోపీచంద్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషితో విశాఖకు గూగుల్ రావడంతో హర్షించదగిన విషయమని టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. రాష్ట్రానికి గూగుల్ పెట్టుబడులు వచ్చిన నేపథ్యంలో గురువారం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గోపీచంద్ మాట్లాడుతూ, గూగుల్ పెట్టుబడులతో రాష్ట్ర ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాల సాధనకు నిరంతరం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ శ్రేణులు

కృషి చేస్తోందన్నారు. చరిత్ర సృష్టించాలన్నా, తిరగ రాయాలన్నా కేవలం చంద్రబాబు వల్లే సాధ్యమన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ కుంచె నాని, మోటమర్రి బాబాప్రసాద్, లోగిశెట్టి వెంకట స్వామి, పల్లపాటి సుబ్రహ్మణ్యం, పి.వి.ఫణికుమార్, ఇలియాస్‌పాషా, పిప్పళ్ల కాంతారావు, దింటకుర్తి సుధాకర్, తలారి రాంబాబు, కరెడ్ల సుశీల, వేముల బుజ్జి, నిరంజన్, లంకే హరికృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధికి నాంది : ఎమ్మెల్యే కాగిత

బంటుమిల్లి : గూగుల్ వంటి పెద్ద సంస్థ విశాఖపట్నం రావడం రాష్ట్ర అభివృద్ధికి నాంది అని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాదాపు రెండు లక్షల మందికి ఉపాధి కల్పించే గూగుల్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో కృషి చేసిన మంత్రి నారా లోకేశ్ అభినందనీయులన్నారు. యువతకు ఉపాధి కల్పించాలన్న సంకల్పం, మరో వైపు రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కంపెనీలను రాష్ట్రానికి తీసుకురావడం కేవలం చంద్రబాబునాయుడు, లోకేశ్‌లకే సాధ్యం అన్నారు. విశాఖపట్నం నుంచి సేవలు ప్రపంచానికి అందించడం శుభపరిణామం అని ఆయన అన్నారు.

టీడీపీ బంటుమిల్లి మండల అధ్యక్షుడిగా వీరబాబు

• ప్రముఖుల అభినందనలు



బంటుమిల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బంటుమిల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా కూనపరెడ్డి వీరబాబును నియమిస్తూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ముంజులూరు గ్రామానికి చెందిన కూనపరెడ్డి వీరబాబు టీడీపీ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు పార్టీని బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేశారు. ఎన్ని రాజకీయ ఒత్తిడిలు ఎదురైనా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ, కార్యకర్తలను చైతన్యవంతం చేశారు. అహర్నిశలు పార్టీ కోసం పని చేస్తూ, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను వెన్నంటి ఉండి పార్టీ పటిష్టానికి కృషి చేశారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శిగా డీసీ చైర్మన్ బొర్రా కాశీవిశ్వేశ్వరరావును నియమించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు వీరబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మరో మారు మండల పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన కూనపరెడ్డి వీరబాబు, మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బొర్రా కాశీవిశ్వేశ్వరరావులకు పలువురు ప్రముఖులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

జనవాణి - జనసేన భరోసాలో అర్జీల స్వీకరణ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జనవాణి - జనసేన భరోసా కార్యక్రమంలో రెండో రోజైన గురువారం డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ అర్జీలు స్వీకరించారు. నేషనల్ కాలేజీ పక్కన చలపాటి కాలనీలో నివాస గృహాలపై నుంచి వెళ్లిన 11 కెవి విద్యుత్ తీగలను తొలగించాలని దేవనూరి వీరబాబు వినతిపత్రం సమర్పించారు. రామకృష్ణ విద్యుత్ డీఈతో ఫోనులో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, గల్లా తిమోతి, చిలంకుర్తి పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీపీవో సుజనకుమారి పదోన్నతిపై బదిలీ



పెడన, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారి (టీపీవో) బళ్ళ సుజనకుమారి బదిలీ అయ్యారు. ఆమెకు అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ (ఏపీవో)గా పదోన్నతి కల్పించి మచిలీపట్నంలోని ముడా కార్యాలయానికి బదిలీ చేశారు. పెడన మునిసిపాలిటీలో 13 నెలల పాటు పనిచేసిన సుజనకుమారి సమర్థురాలైన అధికారి గా పేరు తెచ్చుకున్నారు.

వ్యర్థాల సేకరణ పథకంపై అవగాహన

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు ఆధ్వర్యంలో వ్యర్థాల సేకరణ పథకంపై సుమారు వంద మందికి అవగాహన కల్పించారు. దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో వివరాలు నమోదు చేశారు. టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబాప్రసాద్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, దింటకుర్తి సుధాకర్, పివి ఫణికుమార్, తలారి రాంబాబు, హెల్త్ అసిస్టెంట్లు, మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, డిబిఆర్‌సి ఆర్గనైజేషన్ తరఫున రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజరు బ్యాంక్ అకౌంట్లు లేని వారికి అకౌంట్లు ఓపెన్ చేయించారు.

పంచాయతీ కార్మికులను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి

చల్లపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం అమలు చేయాలని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పోలినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీన గన్నవరంలో జరిగే కృష్ణాజిల్లా 9వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి కరీముల్లా,సొంతల జయలక్ష్మి, కొమ్ముకూరి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు ఎనిమిది దరఖాస్తులు

నాగాయలంక, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాల ఏర్పాటుకు ఇప్పటి వరకు ఎనిమిది మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ సిహెచ్. వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

అవనిగడ్డ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అవనిగడ్డ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దొరబాబు అన్నారు. వేకనూరు పీహెచ్‌సీలో ఆధ్వర్యంలో పీహెచ్‌సీ ఎన్.ఎల్.హెచ్.పి ప్రియాంక, హెల్త్ సూపర్‌వైజర్ తారక రామారావు విద్యార్థులకు సీపీఆర్ చేసే పద్ధతులపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు నాగరాజు, చంద్రశేఖర్, ఆశా వర్కర్ అరుణ కుమారి పాల్గొన్నారు. **గూడూరు** : ఆకులమన్నాడు గ్రామ పంచాయతీలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ హాస్పటల్‌లో సర్పంచ్ ఎండి రఫీ ఆధ్వర్యంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీససిటేషన్)పై అవగాహన కల్పించారు. మల్లవోలు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించి ధాన్యం కొనుగోలు చేయాలి

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాలను పాటించి ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు సిబ్బందికి సూచించారు. మండల కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఏవో సంజయ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ కె.భారతి ధాన్యాన్ని ఏ విధంగా సేకరించాలి, పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలను వివరించారు.

ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ

పెడన రూరల్ : ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు తీసుకోవాల్సిన విధానాలు, డేటా ఎంట్రీ అంశాలపై మండల పరిషత్ కార్యాలయంలో ఏఏవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటాఎంట్రీ అపరేటర్లకు పౌరసరఫరాల శాఖ అధికారుల గురువారం శిక్షణ నిర్వహించారు. శిక్షకులు సిహెచ్ చిన్నారి, లేఖశ్రీ వరి నాణ్యతా ప్రమాణాలు, తేమశాతం ఎలా నిర్ధారించాలి, శాంపిల్స్ ఎలా తీయాలి అంశాలపై శిక్షణ ఇచ్చారు, ఏవో జెన్నీ, ఏఏవోలు నరశింహ, ఫణీంద్ర, వెంకన్నబాబు, స్వరూప పాల్గొన్నారు.

బాణసంచా షాపులకు అనుమతి లేదు

అవనిగడ్డ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు లేవని ప్రిన్సిపల్ డి.ఉమారాణి తెలిపారు. ప్రభుత్వ కళాశాలల మైదానాల్లో బాణసంచా దుకాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వొదని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు.

పాఠశాల ప్రహరీకి భూమిపూజ

ఘంటసాల : మల్లాయిచిట్టూరు జడ్పీ పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు సర్పంచ్ ఆవుల రేవతి భూమి పూజ చేశారు. నీటి సంఘం అధ్యక్షుడు ఆవుల ధర్మవెంకట నరసయ్య, హెచ్‌ఎం మోహనరావు, ఉపసర్పంచ్ చింతల నాగబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కృష్ణా వర్సిటీ వీసీ రాంజీ



పెడనలో ర్యాలీలో పాల్గొన్న జీఎస్టీ ఏసీ రంగమణి, కమిషనర్

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు ప్రయోజనం

• కృష్ణా వర్సిటీ వీసీ రాంజీ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ పన్ను శ్లాబులు మారడంతో అన్ని వర్గాలకు మేలు చేకూరుతుందని కృష్ణా వర్సిటీ వీసీ కూన రాంజీ పేర్కొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పన్నుల శాఖ డీసీ స్వరూపరాణి జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు వివరించారు. మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రావణి, రిజిస్ట్రార్ ఎన్. ఉష, మారుతి, దిలీప్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.**పెడన** : జీఎస్టీ సంస్కరణలపై రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బంగ్లా స్కూల్ వరకు కొనసాగింది. రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిద్ధిఖ్, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ అత్తిలి రంగమణి, మునిసిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి, ట్రైనీ ఎస్సై నాగరాజు, వాసవీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.**అవనిగడ్డ** : సూపర్ జీఎస్టీ కారణంగా



అవనిగడ్డలో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు

ద్విచక్ర వాహనాల ధరల్లో గణనీయమైన తగ్గుదల వచ్చిందని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. సూపర్ జీఎస్టీ 2.0 కారణంగా ఆటో మొబైల్ రంగంలో తగ్గిన ధరలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రవాణా శాఖ, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ డిప్యూటీ కమీషనర్ స్వరూపరాణి, రవాణా శాఖాధికారి లోకనాథ ప్రసాద్, టీడీపీ నాయకులు బండే రాఘవ,కొండవీటి మధుసూదనరావు, ఆటోమొబైల్ రంగ సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

పైడమ్మ దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారం నేడు

పెడన, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పైడమ్మ దేవస్థాన పాలక మండలి ప్రమాణ స్వీకారం శుక్రవారం ఉదయం 9 గంటలకు జరగనుంది దేవస్థానానికి ఇటీవల 11 మంది సభ్యులతో పాలక మండలిని నియమించిన సంగతి విదితమే. పాలక మండలి సభ్యులు శుక్రవారం ఈవో జి.వి. కృష్ణారావు పర్యవేక్షణలో ప్రమాణ స్వీకారం చేస్తారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, కూటమి నాయకులు హాజరవుతారు.

శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్ పరిశుభ్రం

నాగాయలంక, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్‌ను పంచాయతీ పారిశుధ్య కార్మికులు గురువారం శుభ్రం చేశారు. పారిశుధ్య సిబ్బంది ఘాట్ ప్రాంతాన్ని నదిలోని నీటిని ఇంజనుతో తోడి పైపులతో బురదను కడిగేశారు. కార్యదర్శి జె.పవన్ కుమార్ పర్యవేక్షించారు. ఘాట్‌ను శుద్ధి చేయటంతో సందర్శకులకు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నిరుపేదలకు బియ్యం ప్యాకెట్ల పంపిణీ

కోడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా జనసేన జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత ఆధ్వర్యంలో కోడూరులో గురువారం నిరుపేదలకు బియ్యం ప్యాకెట్లను పంపిణీ చేశారు. యువ నేత మండలి వెంకట్రామ్ కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 60 మంది ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఐదు కేజీల బియ్యం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మర్రె గంగయ్య, కాగిత రామారావు, యర్రంశెట్టి శ్రీదుర్గ, కనగాల వెంకటేశ్వరరావు, కోట రాంబాబు, కొండవీటి రామకృష్ణ, పూతబోయిన కరుణ కుమార్, కోట సుబ్బారావు, కొల్లి వెంకటేశ్వరరావు, అద్దంకి పాండురంగారావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.